

## 'శాకుంతలము'నకు కొన్ని రంగరచనలు

'రూపలేఖ' యను ఆంగ్ల త్రైమాసిక పత్రిక యందు శ్రీ కనైయాలాల్ హెచ్. వకీల్‌గారు (బొంబాయి) భావి నాటకరంగ వికాసమునుగూర్చి వర్ణించుచు విపులవ్యాసములను వ్రాయుచున్నారు. అందు కడచిన గ్రీష్మ-వర్షల సంచిక యందలి వ్యాసమున 'శాకుంతల' ప్రదర్శనమునకు నాలుగు రంగ రచనలు సచిత్రముగ సూచించిరి. అవి మంచి ఘట్టములవి: (౧) సమావేశము, (౨) 'కల్యాణ యాత్ర,' (౩) ప్రత్యాఖ్యానము, (౪) సంయోగము. ఈవ్యాసకర్త విపులముగ రచించెడి చిత్రములనుండి శ్రీ పులినవిహారి దత్తగారు వ్రాసిన చిత్తు రేఖాచిత్రము లివి రంగమున సాధారణములగు ఏర్పాటులు, సర్దుబాటులు చాలునని సూచించుటయే యీ చిత్రముల యుద్దేశము. *

(౧), (౨) (౪) సందర్భములందు, పొందిక లేని అడుగుమట్టికుడ్లు కానరాకుండుటకుగాను మొక్కలకు అడుగుభాగము కప్పియున్నది. ఈచిత్రములలో నున్నరీతి స్థిరమైనది కాదు. రంగరచనకు నేర్పుతో చేయు కొలది మార్పులవలన పొందికలు మారును. (౧) పరికించిన చూచాయగా నిది వనపు తెలియును. ఏర్పాటునుబట్టి మొక్కలు, గుబురుగా, రొట్టదట్టముగా ఎక్కినట్లుండి, వనోచిత ప్రసాధనము పూర్చుచు, నాయకుని అభినయ రమ్యమగు ప్రవేశమున కనుపడుచున్నవి. మరల నవియే నడుమ నడుమ వ్యవధులతో, 'సముద్రము'న నుండి ఒక ఉపవనమును తలపింపగలవు. ముసకగుడ్డలు కప్పి అవి కొంచెము ఎగుడుదిగుడులుగా నుంచుటవలన జొంపము సొంపును చెడలేదు; దాని అలంకరణ ప్రాశస్త్యము వ్యయ

* ఒకానొక సందర్భమున కొంచెములో సంగ్రహముగా శాకుంతల నాటకము నడపవలసి వచ్చినదట: శ్రీ వకీలుగారే సంచాలకులు.

ఒక నాటకము నాట్యప్రయోజనము నర్థముచేసికొనగలపాటి చదువుకొన్నవారై తల తిరుగుడు లేని తెలివిగల నటబృందము దొరకినపుడెల్ల చక్కని నాటకప్రదర్శనమున కనీసపు రంగసౌకర్యములతోనే తారు కృతకృత్యు లగు చుండెడివారట వీరు. అసలు, కనీసపుసౌకర్యముల ప్రయోగమే అనేకము లగు రంగోత్సాహములకు ఉజ్జీవిక మని వీరి అనుభవము. ఈసందర్భమున, ఒక సాదారంగు వెనుకతెర, సబ్బుపెట్టెలవంటివి అనేకపెట్టెలు, కావలసినన్ని ఖాకిగుడ్డలు, కాషాయపుగుడ్డలును, వనసుకు వచ్చిన సాధారణములై వర్ణసామరస్యము గల చెప్పినట్టు విను దీపికావళి, అట్టి వేషసంచయమును—చాలినవట.



రాజా:—అయే, ఏతా స్తపస్వికన్యాః స్వప్రమాణానురూపై స్సేచనఘటై ర్బాలపాదపేభ్యః పయో దాతు మిత ఏవాఽభివర్తంతే. (నిపుణం నిరూప్య) అహో మధుర మాసాం దర్శనమ్.


శుద్ధాంత దుర్లభ మిదం వపు రాశ్రమవాసినో యది జనస్య,
దూరీకృతాః ఖలు గుణై రుద్యానలతా వనలతాభిః.
యావ దిమాం ఛాయా మాశ్రిత్య ప్రతిపాలయామి. —శాకుంతలము.



కాశ్యపః:—వత్సే, ఇతః సద్యోహుతాగ్నీన్ ప్రదక్షిణీ కురుష్వ. (సర్వే పరిక్రామంతి.)

కాశ్యపః:—(ఋక్ఛందసాఽఽశాస్తే)

అమీ వేదిం పరితః క్లృప్తధిష్ణ్యాః, సమిద్వంతః ప్రాంత సంస్తీర్ణదర్భాః,
అపఘ్నంతో దురితం హవ్యగంధైః, వైతానా స్త్వాం వహ్నయః పావయంతు. —శాకుంతలము.



శార్ఙ్గరవః :—కిదిదానీం ప్రతిగృహ్యతా మాపన్నసత్త్వా సహధర్మచారిణీ.

శకుంతలా :—(ఆత్మగతం) కిం ణు క్ఖు అజ్జఉత్తో భణాది. [కిన్ను ఖల్వార్యపుత్రో భణతి.]

రాజా :—కి మిద ముపన్యస్తం ?

శకుంతలా :—పావఓ క్ఖు వఅణోవణ్ణాసో. [పావకః ఖలు వచనోపన్యాసః.]

రాజా :—భోస్తపోధనాః, చింతయన్నపి న ఖలు స్వీకరణ మత్రభవత్యాః స్మరామి. తత్కథ మిమా మభివ్యక్త సత్త్వలక్షణాం ప్రత్యాత్మానం క్షేత్రిణ మాశంకమానః ప్రతిపత్స్యే. —శాకుంతలము.



రాజా :—(శకుంతలాయాః పాదయోః ప్రణిపత్య)

సుతను హృదయాత్ప్రత్యాదేశ వ్యలీక మపైతు తే, కి మపి మనస స్సమ్మోహో మే తదా బలవా నభూత్,
ప్రబలతమసా మేవం ప్రాయా శ్శుభేషు ప్రవృత్తయః, స్రజమపి శిర స్యంధః క్షిప్తాం ధునో త్యహి శంకయా. —శా.

పుష్పగల దురుసు 'వాస్తవికత' తొలగిపోయినది. కాక మఱియు కేవల రీతులపాంపిరులకు పెంపు గూర్చుటకుగా నివి యేర్పడి ఉపయుక్తము లైనవి. ఇక (ర)న చూపినట్లు రాజు శకుంతలను ప్రత్యాఖ్యానము సేయుటకు దర్శన మిచ్చు డాబా అతిసులభమైన ఏర్పాటు: సబ్బు పెట్టెలు మెట్లుమెట్లుగా దొంతరపెట్టి ఖాకిగుడ్డలు, కాషాయపు గుడ్డలు పైని కప్పుట. పెద్ద ఆడంబరమైన 'దృశ్య'విధానము, రంగపరికరము ఈరంగమువలని గొప్పరక్తిని మహా పెంపుచేసెడివి కావు.

---

## రాయప్రోలు సుబ్రహ్మణ్యము గారు

శ్రీ సుబ్రహ్మణ్యముగారు విశ్వామిత్ర, రామదాసు మొదలగుపాత్రములను ధరించువారు. పుష్టిగల శరీరము, శ్రావ్యకంఠము, కుశలాభినయము వీరు ధరించు పాత్రములకు వన్నె పెట్టునవి. విశ్వామిత్రుడు రాజర్షి యయ్యును రజోగుణ మాతని వీడకుండినది. ఆ విషయమును సుబ్రహ్మణ్యంగారి విశ్వామిత్రునియందు గాంచనగును. విశ్వామిత్రుడు బ్రహ్మర్షికాగోరి నిశ్చలమనస్కుడయి ఉగ్రతపమును చేయుచుండును. ఆతపమును భంగించుటకు ఇంద్రుడు మేనకను పంపును. మేనక మనోహర గానముచేతను, నృత్యముచేతను, శృంగార విలాసాదులచేతను విశ్వామిత్రుని వశపరుచుకొనజూచును ఇది విశ్వామిత్రుని కగ్నిపరీక్ష. ఒకవైపు బ్రహ్మర్షిత్వసంపాదనదీక్ష, ఇంకొకవైపు కామోద్రేకము. కడకు కామోద్రేకమువే పైచేయి. ఈ యవస్థలో నుండు విశ్వామిత్రుని మనఃప్రవృత్తిని ఆంగికసాత్త్వికాభినయముల సుబ్రహ్మణ్యముగారు మనోహరముగ చూపగలిగిరి. తదనుగుణముగ వాచికాభినయమును ఒప్పియుండినది. కాని అటనట సంగీత ప్రభావమునకు లోనగుచుండినది. అట్లు కాకుండిన వాచికము ఎక్కువగ సహృదయహృదయములను రంజింపజేయగలదు; నటకునికి ప్రఖ్యాతిని గడింపగలదు. సుబ్రహ్మణ్యముగారి గోపన్న, రామదాసుపాత్రములు గాఢభక్తిని ప్రకాశింపజేయునవి. రామదాసు చెరసాల యందు భక్త్యుద్రేకమున ఉన్మత్తుడగును. అట్టులయ్యును అతని ఆంగికవాచికాదులు భక్తిని పోషించుటకే యగుచుండును; ప్రేక్షకులను భక్తిపరవశులను జేయును. ప్రేక్షకులను దన్మయులను జేయగలుగుటయేకదా నటకుని యభినయకౌశలమునకు పరమప్రయోజనము!

## జంగా వెంకట సుబ్బయ్యా గారు

శ్రీ వెంకట సుబ్బయ్యా గారి అవయవ సౌష్ఠవము, మధురకంఠము స్త్రీపాత్రముల కొప్పియుండును. వీరి స్త్రీపాత్రమున స్త్రీత్వము నాలుగంచులు సరిగ నిమిడియుండును. స్త్రీల సౌందర్యవిలాసాదులు వీరియందు నిండారి యుండును. ప్రేక్షకులు వీరి స్త్రీ పాత్రమును స్త్రీ యనియే భావింతురు కాని ఒక నటకుడు ధరించిన స్త్రీ పాత్రముగా భావింప నవకాశ ముండదను టతిశయోక్తి కాజాలదు.

## నాగయ్యాగారు

శ్రీ నాగయ్యాగారు రామదాసు నాటకమున కబీరుపాత్రమును ధరింతురు, వీరి ప్రసన్న

వదనము, మధురగంభీరకంఠము నా పాత్రమున కెంతయు నొప్పియుండును.

[చిత్తూరు రామవిలాస సభ వారు డిసెంబరు (౧౯౩౧) నెల చివర రామదాసు, కుశలవ, విశ్వామిత్ర అను నాటకములను మూటిని చెన్నపురమున ప్రదర్శించినారు. ఈ సభయందలి నటకులకు గానాభినయముల యందు నైపుణ్యము లలవడియున్నది. వీరి ప్రదర్శనవిధానము, రంగాలంకారాదులు సామాజికుల నలరింప గలిగినవి. శ్రీయుతులు రాయప్రోలు సుబ్రహ్మణ్యము, నాగేశ్వరయ్య, డి. శ్రీనివాసాచార్యులు, జంగా వేంకటసుబ్బయ్యగారలు విశేషించి పేర్కొనదగిన నటకులు. వీరి గానాభినయముల కౌశలము బంగారు పదకములను గడించినవి. క్రొత్తగా చెన్నపురికి వచ్చి నాటకములను ప్రదర్శించి ప్రేక్షకులను రంజిల్ల జేసిన యీ సభవారు ధన్యవాదముల కర్హులు.]

---

## ఆంధ్రమహాసభ, చెన్నపురి

ఆంధ్రమహాసభవారు ౧౯౩౦వ సంవత్సరము డిసెంబరునెల కడపటి నాలుగుదినములు భీష్మ[1], చిత్రనళీయము, రామదాసు, ప్రహ్లాద నాటకములను వరుసగ ప్రదర్శించినారు. ఆంధ్ర నాటకరంగమున పేరు గాంచిన నటకుల[2] సాహాయ్యమున ఈ ప్రదర్శనములు ప్రేక్షక జనరంజకములుగ నుండినవి. ఆంధ్రమహాసభ నటకులకు నాటకపాత్ర ధారణ మాను పంగికము. కళాభిమానమును, ఉత్సాహమును పురస్కరించుకొని వారు తాముధరించిన పాత్రములను సముచితముగ పోషింపగలిగి యుండుట ఇట పేర్కొనదగిన విషయము. మంచి నాటకసమాజములకు తమ జీవితమును కళాపోషణమునకయి సమర్పించిన మంచి నటకు లుండుటావశ్యకము. ఆయతి లేని సమాజములకు అట్టి నటకులు సమకూరుట దుర్లభము. మంచి నటకులు లేనపుడు ప్రదర్శనములు రుచింపకుండుట సహజము. ఎట్లో మిక్కిలి ప్రయాసకు లోనయి నాలుగు నాటకములను ప్రదర్శించి చెన్నపురము నందలి యాంధ్రమహాశయులకానందము నుచేకూర్చిన నేపథ్యాధికారియు, నటకులును ధన్యవాదముల కర్హులు. తమ కిట్లానందమును గలిగించిన ఈసభవారు మున్ముందు మంచి నటకులను తయారుచేసికొని మంచినాటకములను ప్రదర్శించి తమ కింతకన్న నెక్కుడుగా నానందమును గలిగించుటకు జాలునట్లు యథాశక్తిని నాటకకళాభిమానులగు చెన్నపురి ఆంధ్రులు సభవారికి ధనమును సహాయము చేయుటావశ్యకము.

---

౧. ఈ నాటకమును ద్విజేంద్రలాలురాయిగారు తొలుత వంగభాషను రచియించిరి. ఇందలి ఇతివృత్తము పౌరాణికము; దానికి వీరు సాంఘికస్వరూపమును గల్పించిరి. తెనుగు అనువాదము శ్రీ జంధ్యాల శివన్న శాస్త్రిగారిది.

౨. శ్రీ గోవిందరాజుల వెంకటసుబ్బారావుగారు 'భీష్మనాటకము'న శంతనుపాత్రమును, శ్రీ బెల్లంకొండ సుబ్బారావుగారు 'చిత్రనళీయము'న బాహుకపాత్రమును, శ్రీ బళ్లారి రాఘవాచార్యులుగారు 'రామదాసు'న రామదాసుపాత్రమును, 'ప్రహ్లాద' యందు హిరణ్యకశిపుపాత్రమును, శ్రీ తిప్పయ్యగారు 'రామదాసు'న కబీరు పాత్రమును, 'ప్రహ్లాద'యందు లీలావతీపాత్రమును ధరించిరి.

వీరు ప్రదర్శించిన నాటకములలో భీష్మ నాటకము క్రొత్తది. ముమ్ముందును దేశకాలానుగుణములు, ఉత్తమములు నగు నాటకముల నీసభవారు ప్రదర్శించి నాటకకళాభివృద్ధి గావింప దగుదురు.

శ్రీ రాధాకృష్ణయ్యగారు

భీష్మనాటకమున భీష్మపాత్రమును ఆంధ్ర మహాసభ నటులలో ప్రధానులగు శ్రీ వరదా రాధాకృష్ణయ్యగారు ధరించి యా పాత్రను వాచికాంగిక సాత్వికాభినయముల జక్కగా పోషింపగలుగుట మెచ్చుకొనదగిన విషయము. వీరి యితర (నళ, నారద) పాత్రములయందు సంగీతము మిన్నుముట్టుచుండెడిది. సంగీతము మెచ్చుకొనదగినదే అయినను నాటకములయందు దానికి తక్కువ అవకాశము నొసగదగును. భావములను ప్రదర్శించుటకు వలసిన ప్రయత్నము వేఱు. చక్కగా పాడుటకు చేయవలసిన ప్రయత్నము వేఱు. ఈ రెంటికిని పొత్తు కుదురదు. ఈ రెంటియొక్క సంకరమువలన రసానుభూతి సామాజికులకు గలుగజాలదు.



శ్రీ రాధాకృష్ణయ్యగారు

* * * *

ఇంకొకమాట. ఆంధ్రనాటకరంగమున విఖ్యాతిగన్న శ్రీ బళ్లారి రాఘవాచార్యులుగారిక నాటకరంగము నెక్కబోవుట లేదని తెలియవచ్చెడిని. ఇది నిక్కమేయగునేని ఆంధ్ర రంగమునకు తీరని కొఱత గలిగిన దన్నమాట. నాటకరంగమును వీడుటకు వారికి కారణములు పెక్కుండవచ్చును. కాని కళాపోషణ మమూల్యమను విషయమును వారుభావించి చిరకాలము నాంధ్రనాటకరంగమును వీడకుందురుగాక.